మళ్లీ ముంచిన జీపీఎస్!

- కాలువలోకి దూసుకెళ్లిన కారు
- యూపీలోని బరేలీలో మరో ఘటన

లక్నో, డిసెంబర్ 3: గూగుల్ మ్యాప్స్‌ను అనుసరిస్తూ ఉత్తరప్రదేశ్ బరేలీ జిల్లాలో మరో కారు ప్రమాదానికి గురైంది. బరేలీ-పిలిభిత్ రాష్ట్ర రహదారిపై ప్రయాణిస్తున్న ఓ కారు.. దారి తప్పి నది కాలువలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. మంగళవారం బర్కాపూర్ గ్రామం కూడలికి సమీపంలో కాలాపూర్ కాలువ వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. ఆరియా నుంచి సెడాన్ కారులో బయల్దేరిన దివ్యాంషు సింఘ్, మరో ఇద్దరు స్వల్ప గాయాలతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. సమాచారం అందుకున్న ఎమర్జెన్సీ టీమ్ ఘటనాస్థలానికి చేరుకొని కారును క్రేన్ సహాయంతో కాలువ నుంచి బయటకు తీసుకొచ్చారు. కాలువ నీటికి అక్కడి రోడ్డు కోతకు గురైన సంగతి గూగుల్ మ్యాప్స్ నావిగేషన్‌లో అప్‌డేట్ కాకపోవటం వల్లే ఈ ప్రమాదం చోటు చేసుకుంది. 'మేం ప్రయాణిస్తున్న కారు బరేలీ బడా బైపాస్‌కు చేరుకున్నాక, గూగుల్ మ్యాప్స్ పిలిభిత్‌కు వెళ్లే రెండు దారులను చూపింది. ఇందులో ఓ గ్రామం నుంచి షార్ట్‌కట్ దారి ఉందని భావించాం. 5 కిలోమీటర్లు వెళ్లాక.. రోడ్డు తెగిపోయి ఉంది. కారు కాలువలోకి దూసుకెళ్లింది' అని బాధితులు వివరించారు. జీపీఎస్‌ను అనుసరిస్తూ కారు ప్రమాదానికి గురవ్వటం బరేలీ జిల్లాలో ఇది రెండో ఘటన. పది రోజుల (నవంబర్ 24న) క్రితం మైన్‌పూర్‌కు చెందిన ఓ కారు రామ్‌గంగా నదిపై నిర్మాణంలో ఉన్న వంతెనపైకి వెళ్లి.. అక్కడ్నుంచి కిందకు పడిపోయింది. ఈ ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. వంతెన మార్గానికి సంబంధించిన సమాచారం గూగుల్ మ్యాప్స్ నావిగేషన్ అప్‌డేట్ కాకపోవటమే ఈ ప్రమాదానికి కారణమని తెలిసింది.

కృత్రిమ సూర్య గ్రహణం!

- నేడు నింగిలోకి ప్రోబా-3 ఉపగ్రహాలు
- పీఎస్ఎల్‌వీ సీ-59 ద్వారా పంపనున్న ఇస్రో



శ్రీహరికోట, డిసెంబర్ 3: ఖగోళ పరిశోధనల్లో సత్తా చాటుతున్న భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో అద్భుత ప్రయోగానికి సిద్ధమైంది. కృత్రిమ సూర్య గ్రహణాన్ని సృష్టించడం ద్వారా భానుడి గుట్టు విప్పేందుకు ఐరోపా అంతరిక్ష సంస్థ (ఈఎస్ఏ)కు చెందిన ప్రోబా-3 మిషన్ శాటిలైట్లను నింగిలోకి పంపనున్నది. శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి బుధవారం సాయంత్రం 4.06 గంటలకు పీఎస్ఎల్‌వీ-సీ59 రాకెట్ ద్వారా ఈ ప్రయోగాన్ని నిర్వహించనున్నది. ప్రోబా-3 మిషన్‌లో రెండు ఉపగ్రహాలు (కరోనాగ్రాఫ్ స్పేస్‌క్రాఫ్ట్, ఆక్యుల్టర్ స్పేస్‌క్రాఫ్ట్) ఉంటాయి. మొత్తం దాదాపు 550 కిలోల బరువు ఉండే ఈ ఉపగ్రహాలను అతి దీర్ఘవృత్తాకార కక్ష్యలో ప్రవేశపెడతారు. కృత్రిమ గ్రహణాన్ని సృష్టించడం ద్వారా సూర్యుడి బాహ్య వాతావరణమైన కరోనాను అధ్యయనం చేయడం ప్రోబా-3 లక్ష్యం. ఈ ప్రాజెక్టులో భాగంగా ఆ రెండు ఉపగ్రహాలు పరస్పరం సమన్వయం చేసుకుంటూ క్రమపద్ధతిలో భూకక్ష్యలో విహరిస్తాయి. ప్రపంచంలో ఇలాంటి ప్రయోగాన్ని నిర్వహించడం ఇదే తొలిసారి.

మనుషులను ఉతికి ఆరేస్తుంది!

- 'హ్యూమన్ వాషింగ్ మెషీన్' తయారు చేసిన జపాన్ కంపెనీ
- ఓ వ్యక్తి స్నానానికి 15 నిమిషాలు
- త్వరలో మార్కెట్లోకి: కంపెనీ

టోక్యో, డిసెంబర్ 3: బట్టలు ఉతికి ఆరేసినట్టు మనుషులను కూడా ఉతికి ఆరేసే 'హ్యూమన్ వాషింగ్ మెషీన్లు' భవిష్యత్తులో రాబోతున్నాయి. బాగా అలసిపోయిన వ్యక్తి స్నానం చేసే ఓపిక లేకపోతే.. మెషీన్‌లోని టబ్‌లో 15 నిమిషాలు కూర్చుంటే చాలు! కొద్ది నిమిషాల తర్వాత తలతలలాడే శరీరంతో బయటకు రావొచ్చు! మెషీన్‌లోని 'ఏఐ' (కృత్రిమ మేధ) వ్యక్తి శరీరం, చర్మం తీరును పరిగణనలోకి తీసుకొని వాష్ అండ్ డ్రై ఆప్షన్స్ నిర్ణయిస్తుంది. జపాన్‌కు చెందిన 'సైన్స్ కో' కంపెనీ ఇంజనీర్లు ఈ మెషీన్‌ను తయారుచేసినట్టు 'డెయిలీ మెయిల్' కథనం పేర్కొన్నది. ఒసాకా కన్సాయ్ ఎక్స్‌పోలో 1,000 మంది అతిథులు ప్రయోగాత్మకంగా వాడుకోవటానికి ఏర్పాట్లు జరిగాయి. ఈ ప్రదర్శన తర్వాత మాస్ ప్రొడక్షన్ వర్షన్‌ను విడుదల చేస్తామని 'సైన్స్ కో' కంపెనీ చైర్మన్ ఆయోమా వెల్లడించారు. మనుషుల భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని జపాన్ ఇంజినీర్లు దీనిని తయారుశారు. అయితే.. ఈ మెషీన్ డిజైన్ 50 ఏండ్ల క్రితం నాటిది. 1970లో జపాన్ వరల్డ్ సాన్యో ఎల్టక్రిక్ కో (ప్రస్తుతం పానసోనిక్) దీనిని మొదటిసారి తయారుచేసింది. దాంతో పోల్చితే కొత్త వెర్షన్‌లో అత్యధిక మసాజ్ బాల్స్ వంటివి అమర్చినట్టు తయారీదారులు పేర్కొన్నారు.

ఎలా పనిచేస్తుంది?

ఫైటర్‌జెట్ కాక్‌పిట్ ఆకారంలోని ప్లాస్టిక్ ప్యాడ్‌లోకి మనిషి ప్రవేశించాక, అది సగానికిపైగా గోరువెచ్చని నీరు నిండుతుంది. ఆ తర్వాత అందులోని హైస్పీడ్ జెట్స్ నీటిని వేగంగా విరజిమ్ముతుంది. స్నానం చేసే వ్యక్తిని ఆహ్లాదపర్చేందుకు ఇందులో ఏర్పాట్లు ఉన్నాయట. ఏఐ ద్వారా స్నానం చేస్తున్న వ్యక్తి శారీరక పరిస్థితిని మెషీన్ సేకరిస్తుందట.

ముడా స్కామ్ 700 కోట్లు!

- ఆధారాలు గుర్తించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్
- సీఎం సిద్ధరామయ్య భార్యకు 14 సైట్లు కట్టబెట్టారు
- రికార్డుల తారుమారు, సంతకాల ఫోర్జరీ జరిగింది
- సిద్ధరామయ్య వ్యక్తిగత సహాయకుడే సూత్రధారి
- లగ్జరీ కార్లు తీసుకొని బినామీలకు ఖరీదైన జాగాలు
- సాక్ష్యాధారాలతో సహా నివేదికను రెడీ చేసిన ఈడీ

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ): కన్నడ రాజకీయాలను కుదిపేస్తున్న ముడా స్కామ్‌లో కీలక పరిణామం చోటుచేసుకొన్నది. ముడా (మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) కుంభకోణంలో అక్రమాలు జరిగినట్టు తాము సాక్ష్యాధారాలతో సహా గుర్తించామని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మంగళవారం వెల్లడించింది. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సతీమణి బీఎం పార్వతికి 14 సైట్లను ధారాదత్తం చేసే ప్రక్రియలో నిబంధనల ఉల్లంఘన జరిగిందని, దీంతో పాటు 1,095 సైట్లను బినామీల పేరిట కొందరికి అక్రమంగా కట్టబెట్టారని ఈడీ తెలిపింది. ఈ మేరకు లోకాయుక్త పోలీసులకు ఇచ్చిన నివేదికలో వివరించింది.

ఈడీ నివేదికలో ఏమున్నదంటే?

ఈడీ నివేదిక ప్రకారం.. పార్వతికి కట్టబెట్టిన 14 సైట్లలో నిబంధనల ఉల్లంఘన జరిగింది. ఖరీదైన భూములను కాజేయడానికి సాక్ష్యాలు, ఆధారాలను తారుమారు చేశారు. అధికార దుర్వినియోగం జరిగింది. అధికారుల సంతకాలను కూడా ఫోర్జరీ చేశారు. పార్వతికి లబ్ధి చేయడానికే ఇదంతా చేసినట్టు తమ విచారణలో తేలిందని ఈడీ నివేదికలో వెల్లడించింది. ఈ అక్రమాలన్నీ సీఎం సిద్ధరామయ్య వ్యక్తిగత సహాయకుడు, ముడా మాజీ కమిషనర్ ఎస్‌జీ దినేశ్ కుమార్ అలియాస్ సీటీ కుమార్ కనుసన్నల్లోనే జరిగినట్టు ఈడీ ఆరోపించింది. దీంతో పాటు ముడా పరిధిలోని ఖరీదైన 1,095 సైట్లను బినామీల పేరిట కొందరు వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకులు అక్రమంగా దక్కించుకొన్నారని, వీటి విలువ బహిరంగ మార్కెట్‌లో రూ. 700 కోట్లపైమాటేనని ఈడీ వెల్లడించింది. ఖరీదైన స్థలాలను చవగ్గా దక్కించుకోవడానికి ఎస్‌జీ దినేశ్ కుమార్‌తో పాటు ముడాలో అప్పుడు ఉన్నత పోస్టుల్లో ఉన్నవారికి కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు, నేతలు లగ్జరీ కార్లు, స్థిరాస్థులను బహుమతిగా ఇచ్చినట్టు ఆరోపించింది. అలా కాజేసిన స్థలాలను వీళ్లు ఎక్కువ రేటుకు ఇతరులకు విక్రయించారని తెలిపింది. పార్వతికి కుమారుడు, ఎమ్మెల్యే యతీంద్ర ముడా బోర్డులో సభ్యుడుగానూ వ్యవహరించారని ఈడీ గుర్తు చేసింది.

ఖరీదైన ప్రాంతాల్లో భూములు

ఈడీ, ప్రతిపక్ష నేతల ఆరోపణల ప్రకారం.. మైసూరు శివారులోని కెసరె గ్రామంలో పార్వతికి 3 ఎకరాల 16 గుంటల భూమి ఉంది. అయితే, అవసరాల దృష్ట్యా ఆ భూమిని సేకరించిన ప్రభుత్వం.. దానికి బదులుగా నగరం లోపల అత్యంత ఖరీదైన ప్రాంతాలుగా చెప్పుకొనే విజయనగర్, దట్టగల్లి, జేపీ నగర్, ఆర్టీ నగర్, హంచయా-సతాగల్లీలో సిద్ధరామయ్య కుటుంబానికి 38,283 చదరపు అడుగుల భూమిని (14 సైట్స్ కలిపి) కేటాయించింది. 50:50 నిష్పత్తిలో (పడావు పడ్డ ఒక ఎకరా తీసుకొంటే, అభివృద్ధి చేసిన అర్ధ ఎకరం ఇవ్వడం) ఈ కేటాయింపు జరిగింది. అయితే, కెసరెలోని భూములతో పోలిస్తే మార్కెట్ ధర అతి ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో సిద్ధరామయ్య కుటుంబానికి ఆ భూములను కేటాయించాలని ఎవరు సిఫారసు చేశారని బీజేపీ నేత ఆర్ అశోక్ నిలదీశారు. క్యాబినెట్ అనుమతి లేకుండా భూములు కేటాయించే అధికారం ఎవరికి ఉంటుందని, ముఖ్యమంత్రికి తెలియకుండానే ఇంత పెద్ద కుంభకోణం జరిగిందా? అని ఆయన ప్రశ్నించారు. ఈ స్కామ్ మూలంగా కోట్ల రూపాయలు పక్కదారి పట్టాయని ముగ్గురు హక్కుల కార్యకర్తలు ప్రదీప్ కుమార్, టీజే అబ్రహం, స్నేహమయి కృష్ణ.. లోకాయుక్త పోలీసులకు, గవర్నర్ కార్యాలయానికి ఫిర్యాదు చేశారు.

సీఎం సిద్ధరామయ్య విచారణ

తనపై దర్యాప్తు జరిపేందుకు గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ ఇచ్చిన అనుమతిని సీఎం సిద్ధరామయ్య హైకోర్టులో సవాల్ చేశారు. అయితే, పిటిషన్‌ను హైకోర్టు డిస్మిస్ చేసింది. పిటిషన్‌లో వివరించిన అంశాలపై నిస్సందేహంగా దర్యాప్తు జరిపించడం అవసరమని తెలిపింది. హైకోర్టు ఆదేశాలను బట్టి సీఎం సిద్ధరామయ్యను విచారించి రిపోర్టును డిసెంబర్ 24లోపు సమర్పించాలని ప్రత్యేక కోర్టు లోకాయుక్త పోలీసులను ఆదేశించింది. ఈ నేపథ్యంలోనే సీఎం సిద్ధరామయ్యకు లోకాయుక్త పోలీసులు నోటీసులు పంపి విచారించారు. ఈ క్రమంలోనే ఈడీ నివేదికను సమర్పించడం సంచలనంగా మారింది.

భారత హై కమిషనర్‌కు బంగ్లాదేశ్ సమన్లు

అగర్తలలో దౌత్యసేవలు నిలిపివేత

న్యూఢిల్లీ: పొరుగుదేశం బంగ్లాదేశ్ మనపై కవ్వింపు చర్యలు కొనసాగిస్తూనే ఉంది. బంగ్లాదేశ్‌లోని భారత హై కమిషనర్ ప్రణయ్ వర్మకు మంగళవారం సమన్లు జారీ చేసింది. దీంతో వర్మ బంగ్లాదేశ్ ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. త్రిపుర రాజధాని అగర్తలలోని బంగ్లాదేశ్ దౌత్య కార్యాలయాన్ని ఆందోళనకారులు ముట్టడించిన నేపథ్యంలో ఈ సమన్లు జారీచేసినట్టు సమాచారం. అగర్తలలోని బంగ్లాదేశ్ అసిస్టెంట్ హై కమిషన్‌లో అన్ని దౌత్య సేవలు నిలిపివేస్తున్నామని బంగ్లాదేశ్ అధికారి ఒకరు తెలిపారు.

వుహాన్ ల్యాబ్ నుంచే 'కరోనా' లీక్

న్యూఢిల్లీ: దాదాపుగా ఐదేండ్లు అవుతున్నా ప్రపంచాన్ని అతలాకుతలం చేసిన కరోనా వైరస్ ఎక్కడి నుంచి బయటకు వచ్చిందన్నది ఇప్పటికీ మిలియన్ డాలర్ల ప్రశ్నగానే మిగిలిపోయింది. చైనాలోని వుహాన్ ల్యాబ్ నుంచే ఈ వైరస్ లీక్ అయినట్టు అప్పట్లో వార్తలొచ్చినా దీనిని నిరూపించే ఆధారాలు లభించలేదు. తాజాగా, ఈ విషయంలో అమెరికా ఓ నిర్ణయానికి వచ్చింది. కరోనా వైరస్ వుహాన్ ల్యాబ్ నుంచే లీక్ అయి ఉండొచ్చని పేర్కొంది. దాదాపు పది లక్షలమందికిపైగా అమెరికన్లను పొట్టనపెట్టుకున్న కరోనా వైరస్‌పై రెండేళ్లపాటు సుదీర్ఘంగా జరిగిన దర్యాప్తు తర్వాత అమెరికా రిపబ్లికన్ నేతృత్వంలోని హౌస్ సెలక్షన్ కమిటీ ఈ విషయాన్ని స్పష్టం చేసింది.

సుప్రీంకోర్టు జడ్జిగా జస్టిస్ మన్మోహన్

న్యూఢిల్లీ: ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మన్మోహన్ మంగళవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. బాధ్యతలు చేపట్టిన రోజు నుంచి ఆయన నియామకం అమలులోకి వస్తుందని అధికారిక నోటిఫికేషన్ పేర్కొంది. జస్టిస్ మన్మోహన్‌ను సుప్రీంకోర్టు జడ్జిగా పదోన్నతి కల్పించాలని సుప్రీంకోర్టు కొలీజియం నవంబర్ 28న సిఫార్సు చేయగా రాష్ట్రపతి ఆయనను నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఢిల్లీ హైకోర్టు తాత్కాలిక చీఫ్ జస్టిస్‌గా విభూ బఖ్రూ నియమితులైనట్లు న్యాయశాఖ తెలిపింది.

ప్రీమియం రైలు ఆలస్యమైతే ఉచిత భోజనం!

3 గంటల కన్నా లేటయితే పూర్తి చార్జీ వాపసు

న్యూఢిల్లీ, డిసెంబర్ 3: ప్రయాణికులకు రైల్వే శుభవార్త చెప్పింది. ఇక నుంచి రైలు ఆలస్యమైతే ప్రయాణికులకు ఉచితంగా ఆహారం అందజేస్తామని ప్రకటించింది. ఐఆర్‌సీటీసీ క్యాటరింగ్ పాలసీ కింద నిర్దేశిత సమయం కన్నా రెండు లేదా అంతకంటే ఎక్కువ గంటలు ఆలస్యమైన రైళ్లలో ప్రయాణికులకు ఉచిత భోజనం లేదా అల్పాహారం అందజేస్తారు. రైలు కోసం వేచి చూస్తున్నవారికి, గమ్యాన్ని చేరుకోవడానికి వేచి ఉన్న ప్రయాణికులకు దీనిని అందజేస్తారు. అయితే ఈ ఉచిత భోజన సౌకర్యం రాజధాని, శతాబ్ది, దురంతో లాంటి ప్రీమియం రైలు ప్రయాణికులకే వర్తిస్తుంది.

పూర్తి చార్జీతో టికెట్ వాపసు

ఒక వేళ రైళ్ల రాకపోకలలో మూడు గంటలు లేదా అంతకంటే ఎక్కువ ఆలస్యం జరిగినా, దారి మళ్లించినా ప్రయణికుడు కోరితే పూర్తి టికెట్ చార్జీలను వాపసు ఇస్తారు.

అదానీపై వెనక్కి తగ్గిన కాంగ్రెస్

- పోరుపై పార్టీ ఉభయ సభల ఎంపీల్లో విభేదాలు
- రాజ్యసభ ఎంపీలు సై అంటే.. లోక్‌సభ ఎంపీలు నై
- చేయిచ్చిన తృణమూల్, ఎస్పీ

న్యూఢిల్లీ, డిసెంబర్ 3: ప్రముఖ పారిశ్రామికవేత్త గౌతం అదానీ అవినీతి వ్యవహారంపై చర్చ జరగాలంటూ దాదాపు ఆరురోజుల పాటు పార్లమెంట్ సమావేశాలను స్తంభింపజేసిన కాంగ్రెస్ పార్టీ ఒక్కసారిగా తన వైఖరిని మార్చుకుంది. దీంతో మంగళవారం పార్లమెంట్ ఉభయ సభల సమావేశాలు సజావుగా సాగాయి. దీంతో అదానీపై పోరు నుంచి కాంగ్రెస్ వైదొలగడానికి గల కారణాలేమిటన్నది చర్చనీయాంశంగా మారింది. అదానీపై పోరులో కాంగ్రెస్ పార్గీలోనే విభేదాలున్నాయని ఒక వాదన వినిపిస్తుండగా.. మిత్రపక్ష పార్టీల నుంచి కూడా సహకారం లభించడం లేదని మరికొందరు అంటున్నారు. సౌర విద్యుత్తు కాంట్రాక్టులు పొందేందుకు అధికారులకు లంచాలు ఇచ్చారన్న అభియోగంపై అదానీపై అమెరికాలో కేసులు నమోదైన నేపథ్యంలో ఈ అంశంపై ప్రభుత్వాన్ని నిలదీయాలని ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ గత నెల 21న పార్టీ ఎంపీలకు పిలుపునిచ్చారు. పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమైన నాటి నుంచి కాంగ్రెస్ ఇదే అంశాన్ని లేవనెత్తుతూ సమావేశాలు సాగకుండా అడ్డుకున్నది.

ఇంటా బయట వ్యతిరేకత

ప్రజలకు సంబంధించిన ఎన్నో ముఖ్యాంశాలు పార్లమెంట్‌లో చర్చించాల్సి ఉండగా అదానీపై చర్చ కోసం సభను స్తంభింపజేయడం సబబు కాదంటూ కాంగ్రెస్ మిత్రపక్షాలు సోమవారం పరోక్షంగా తమ అసంతృప్తిని వెళ్లగక్కాయి. అదానీపై కాంగ్రెస్ జరుపుతున్న ఆందోళనలో సమాజ్‌వాదీ, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు పాల్గొనలేదు. నిరుద్యోగం, ధరల పెరుగుదల, ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల పట్ల నిధుల విడుదలలో వివక్ష వంటి అంశాలపై సభలో చర్చ జరగాలని తృణమూల్ డిమాండ్ చేసింది. ఐదుగురి మృతికి కారణమైన సంభల్‌లోని షామీ జమా మసీదు ఘటనను లేవనెత్తాలని సమాజ్‌వాదీ పార్టీ భావిస్తున్నది. ఈ మేరకు ఆ పార్టీ ఎంపీలు స్పీకర్‌ను కలిసి విజ్ఞప్తిచేశారు. కేవలం అదానీ అంశాన్ని పట్టుకొని వేళ్లాడటంపై కాంగ్రెస్ లోక్‌సభ సభ్యులు సైతం అసంతృప్తిగా ఉన్నట్టు తెలిసింది. పార్లమెంట్‌లో కాంగ్రెస్ అనుసరించాల్సిన వైఖరిని పార్టీ రాజ్యసభ ఎంపీలు నిర్దేశిస్తున్నారని ఆ పార్టీ లోక్‌సభ సభ్యులు కినుక వహించినట్టు ఓ ఆంగ్ల పత్రికలో సోమవారం ఓ వార్తా కథనం ప్రచురితమైంది. ప్రజలు ఓట్లు వేస్తే గెలిచిన తామే ప్రజలకు జవాబుదారీ అని, తమ పార్టీ రాజ్యసభ సభ్యులు కాదని ఓ అరడజను మంది కాంగ్రెస్ ఎంపీలు ఆ ఆంగ్ల పత్రికతో వాపోయారట. నిజానికి దేశంలో సామాన్య ప్రజలు అదానీ అంశాన్ని పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ ఎంపీలు భావిస్తున్నారు. అందుకే తాము పార్లమెంట్ లోపల, బయట ఎంత మొత్తుకుంటున్నా ప్రజల నుంచి స్పందన రావడం లేదని వారు భావిస్తున్నట్టు తెలిసింది. చర్చల్లో పాల్గొంటూ అనేక అంశాల్లో ప్రభుత్వాన్ని ఇరుకునపెట్టేందుకు ఉన్న అవకాశాలను రాహుల్‌గాంధీ చేతులారా చేజార్చుకుంటున్నారని కాంగ్రెస్ ఎంపీలు అనుకుంటున్నట్టు సమాచారం.

జనాభా సంక్షోభంతో కనుమరుగు!

- తొలి దేశంగా దక్షిణ కొరియా

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ): ఈ భూప్రపంచంపై కనుమరుగుకానున్న తొలి దేశంగా దక్షిణ కొరియా రికార్డుల్లో నిలిచిపోనున్నట్టు నిపుణులు చెప్తున్నారు. జనాభా సంక్షోభమే దీనికి కారణంగా విశ్లేషిస్తున్నారు. కొరియాలో జననాల రేటు చరిత్రలో ఎన్నడూ చూడనిస్థాయికి పడిపోయినట్టు గుర్తుచేస్తున్నారు. ఇది ఇలాగే కొనసాగితే ఈ శతాబ్దం చివరినాటికి ఆ దేశ జనాభా 66 శాతం మేర పడిపోనున్నట్టు అంచనా వేస్తున్నారు. అంటే ప్రస్తుతం 5.2 కోట్ల మంది ఉన్న దక్షిణ కొరియా జనాభా ఈ శతాబ్దం చివరి నాటికి 1.4 కోట్లకు పడిపోనున్నట్టు చెప్తున్నారు.

కారణం ఏమిటి?

జనాభాను కట్టడి చేయడానికి 1960వ దశకంలో అప్పటి కొరియా ప్రభుత్వం కుటుంబ నియంత్రణ పాలసీని తీసుకొచ్చింది. దీంతో ఒక్కో మహిళకు ఆరుగురు సంతానం ఉండే స్థితి నుంచి 1983 నాటికి ఇద్దరికి దిగివచ్చింది. ఆ తర్వాత ఇది మరింతగా పడిపోయింది. ఇప్పుడు ఆ నిర్ణయమే జనాభా సంక్షోభానికి కారణంగా మారింది. జననాల రేటును పెంచేందుకు పన్ను మినహాయింపులు, శిశు సంరక్షణ ప్రోగ్రామ్స్‌లో రాయితీలు, సైన్యంలో చేరే వారికి సంతానంలో సడలింపులను ఇస్తున్నప్పటికీ పరిస్థితిలో పెద్దగా మార్పు రావట్లేదు. ఇది ఇలాగే కొనసాగితే, జననాల రేటు పూర్తిగా పడిపోయి త్వరలోనే దక్షిణ కొరియా ఉనికే ప్రశ్నార్థకమయ్యే ప్రమాదం ఉండొచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

దక్షిణ కొరియాలో అత్యవసర పరిస్థితి

'మార్షల్ లా' విధించిన అధ్యక్షుడు యోల్.. విపక్షాల ఆగ్రహం

సియోల్: దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. దేశంలో 'ఎమర్జెన్సీ మార్షల్ లా' విధిస్తున్నట్టు మంగళవారం ప్రకటించారు. ఈ మేరకు ఆయన జాతిసుద్దేశించి ప్రసంగించారు. పార్లమెంట్‌లోని ప్రతిపక్షాలు దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాయని తీవ్ర ఆరోపణలు చేశారు. అందువల్లే దేశంలో అత్యవసర పరిస్థితి విధించాల్సి వచ్చిందని తెలిపారు. పొరుగుదేశం ఉత్తర కొరియాకు అనుకూలంగా ప్రతిపక్షాలు పార్లమెంట్‌ను కట్టడి చేస్తున్నాయని ఆరోపించారు. దేశంలోని ఉత్తర కొరియా అనుకూల శక్తుల్ని నిర్మూలిస్తానని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిస్తానని ప్రతిజ్ఞ చేశారు. మార్షల్ లా విధింపుతో ఏర్పడే అసౌకర్యాన్ని సహనంతో భరించాలని ప్రజల్ని కోరారు. వీలైనంత తొందర్లో దేశంలో మళ్లీ సాధారణ పరిస్థితులు ఏర్పడతాయని చెప్పారు. కాగా, దేశంలో 'మార్షల్ లా' విధింపును ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. పార్లమెంట్ బయట నిరసనకు దిగాయి. పోలీసులు వారి నిరసనను అడ్డుకోవటంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. మార్షల్ లా విధింపుతో ఎలాంటి రాజకీయ కార్యక్రమాలు నిర్వహించడానికి వీలుండదు. అధ్యక్షుడు ప్రకటన వెలువడిన కొద్ది గంటల్లోనే ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పార్లమెంట్ తీర్మానం చేసింది.

ఈవీఎంలపై నమ్మకం లేదు!

- బ్యాలెట్ పేపర్ ద్వారా రీపోలింగ్‌కు సిద్ధమైన మహారాష్ట్రలోని గ్రామం
- అడ్డుకున్న అధికారులు.. కర్ఫ్యూ

ముంబై, డిసెంబర్ 3: ఇటీవల జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలపై సోలాపూర్ జిల్లాలోని మర్కడ్వాడి గ్రామ ఓటర్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈవీఎం ఓటింగ్‌పై అపనమ్మకం వ్యక్తం చేస్తూ గ్రామంలో ఈసారి బ్యాలెట్ పేపర్ ద్వారా మంగళవారం రీపోలింగ్ నిర్వహించడానికి సిద్ధమయ్యారు. ఏర్పాట్లు కూడా పూర్తి చేశారు. దీంతో పోలీసులు ముందు జాగ్రత్త చర్యగా సోమవారం నుంచి ఈ నెల 5 వరకు గ్రామంలో కర్ఫ్యూ విధించి వారి ప్రయత్నాలను భగ్నం చేశారు. ఈ గ్రామం ఎస్సీలకు రిజర్వ్ చేసిన మల్షిరాస్ శాసనసభ నియోజకవర్గ పరిధిలోకి వస్తుంది. తాజా ఎన్నికలో బీజేపీ అభ్యర్థి రామ్ సత్పుటేను ఎన్సీపీ (శరద్ పవార్) పార్టీ అభ్యర్థి ఉత్తమ్ జన్‌కర్ 13,147 ఓట్ల తేడాతో ఓడించారు. ఎన్నికల సంఘం వెల్లడించిన వివరాల ప్రకారం ఇక్కడ సత్పుటేకు 1,003, జన్‌కర్‌కు 843 ఓట్లు వచ్చాయి. అయితే తమ మద్దతుదారుడే ఎన్నికల్లో నెగ్గినా.. బీజేపీకి గ్రామంలో అన్ని ఓట్లు రావడం ప్రతిపక్ష మహావికాస్ అఘాడీ (ఎంవీఏ)కి ఎక్కువ మంది మద్దతుదారులున్న గ్రామస్తులకు ఆగ్రహం కలిగించింది. తమ గ్రామంలో సత్పుటేకు అన్ని ఓట్లు వచ్చే ప్రసక్తే లేదని, ఈవీఎంలలో గంగరగోళమే దీనికి కారణమని వారు ఆరోపించారు. ఈ ఓటింగ్‌లో పాల్గొనాలంటూ గ్రామమంతా పెద్దయెత్తున బ్యానర్లు కూడా వెలిశాయి. అయితే ఎన్నికల ప్రక్రియను నిర్వహించాలంటూ గ్రామస్తుల నుంచి వచ్చిన విజ్ఞప్తిని అధికారులు తిరస్కరించారు. 'పారదర్శకంగా నిర్వహించిన ఎన్నికల్లో ఇక్కడ ఎన్నికల ప్రక్రియ నవంబర్ 23నే ముగిసింది. ఇక్కడ మూడు బూత్‌ల్లో జరిగిన పోలింగ్‌లో ఎలాంటి అక్రమాలు జరగలేదు' అని మల్షిరాస్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి విజయ్ పంగర్కర్ తెలిపారు. గ్రామస్తుల చర్యపై సోలాపూర్ జిల్లా యంత్రాంగం అసంతృప్తి వ్యక్తం చేసింది. అలాంటి ప్రయత్నాలు ఉద్రిక్త పరిస్థితులకు దారితీస్తాయని హెచ్చరించింది. 'పరిస్థితులు ఎలా ఉన్నా ఓటింగ్ నిర్వహించడానికి ప్రజలు సిద్ధమయ్యారు' అని ఎన్నికైన ఉత్తమ్ రావ్ జన్‌కర్ పేర్కొన్నారు.

మహారాష్ట్ర సీఎంగా ఫడ్నవీస్!

డిప్యూటీ సీఎంలుగా షిండే, అజిత్ పవార్

చర్చలు కొలిక్కి వచ్చినట్టు కథనాలు

ముంబై, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ): మహారాష్ట్ర కొత్త ముఖ్యమంత్రిగా బీజేపీ నేత దేవేంద్ర ఫడ్నవీస్ పేరు దాదాపు ఖరారైంది. ఉపముఖ్యమంత్రులుగా ఏక్‌నాథ్ షిండే, ఎన్సీపీ అధినేత అజిత్ పవార్ నియమితులు కానున్నట్టు తెలుస్తున్నది. ఈ మేరకు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ముంబైలోని ఆజాద్ మైదాన్‌లో ఈ నెల 5న సాయంత్రం 5 గంటలకు ప్రమాణ స్వీకారోత్సవానికి ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో పాటు పలువురు కేంద్ర మంత్రులు, ఎన్‌డీఏ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులతో పాటు 40 వేల మంది కార్యకర్తలు, నేతలు కూడా హాజరుకానున్నారు. ఇందులో 10 వేల మంది కార్యకర్తలు ఏక్ హైతో సేఫ్ హై అనే సందేశంతో కూడిన టీ-షర్టులు ధరించనున్నారు.

1.5 లక్షల టెకీలపై వేటు

- ఈ ఏడాది దిగ్గజ కంపెనీల్లో భారీగా ఉద్యోగాల కోతలు
- ఆర్థిక ఒడిదొడుకులు, ఏఐ ప్రభావం ప